క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎస్సై పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసి పోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

2న కంచికచర్ల మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవంబర్ 2వ తేదీ ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కె.శిల్ప ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో ఆయా మండలశాఖ అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

జిల్లేడు ద్రావణంతో వరికి ఎంతో మేలు



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): పిలక, పొట్టదశలో ఉన్న వరి పొలంలో జిల్లేడు ద్రావణం స్ప్రే చేస్తే సూక్ష్మపోషకాలు వృద్ధి చెందడంతోపాటు గింజ నాణ్యత కూడా పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల ప్రతినిధి వన్నూరప్ప సూచించారు. గ్రామంలోని రామాలయం వద్ద ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో రైతులు, మహిళలకు జిల్లేడు ద్రావణం తయారీపై ఆయన అవగాహన కల్పించారు. గింజ తాలు రాకుండా ఉండటానికి పొటాషియం, యూరియా చల్లుతుంటారని, కానీ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఖర్చు లేకుండా జిల్లేడు ద్రావణం స్ప్రే చేస్తే సరిపోతుందని రైతులకు వివరించారు. జిల్లేడు ద్రావణం పిచికారీ ద్వారా గింజ నాణ్యత పెరిగి అధిక దిగుబడుల సాధించవచ్చని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



వీరులపాడు: ఆరు రాష్ట్రాలలో 42 శాఖల ద్వారా రూ.3,620 కోట్లకు పైగా వ్యాపారం చేస్తున్నట్లు వీరులపాడు సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి. సుబ్బయ్య చౌదరి తెలిపారు. వీరులపాడు సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వీరులపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో 95శాతం మార్కులు సాధించిన ఖాతాదారుల పిల్లలకు ఆదివారం ప్రతిభా పురస్కారాలతోపాటు రూ.10 వేల నగదు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిజన్ సొసైటీ సభ్యులకు కూడా గతేడాది 25 శాతం డివిడెండ్ చెల్లించినట్లు చెప్పారు. చదువులో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్న ఖాతాదారుల పిల్లలకు 26 ఏళ్లుగా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పెద్దాపురం



పెద్దాపురంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం



రూ.17.50లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

- రూ.1.31కోట్లతో అభివృద్ధి పనులు..
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ ఏర్పాటు
- సమకూరిన మౌలికవసతులు



రూ.18కోట్లతో నిర్మించిన కంచికచర్ల-పెద్దాపురం రహదారి

పెద్దాపురం(వీరులపాడు):గతప్రభుత్వాల హయాంలో కనీసవసతులకు కరువైన గ్రామాలు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నాయి. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండుకళ్లుగా భావిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలతో పల్లెసీమలు ప్రగతిపథంలో సాగుతున్నాయి. విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలికవసతుల కల్పనలో ప్రభుత్వంచేస్తున్న కృషికి గ్రామాలు సైతం పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. అందుకు నిదర్శనం వీరులపాడు మండలంలోని పెద్దాపురం మేజర్ గ్రామపంచాయతీ.

పెద్దఎత్తున అభివృద్ధి పనులు..

గత ప్రభుత్వాల హయాంలో రోడ్లు, డ్రెయిన్లు వంటి కనీస వసతులులేక పెద్దాపురం పంచాయతీ ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పల్లెసీమల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు కోట్లాది రూపాయల నిధులను కేటాయించడంతో మౌలికవసతులు సమకూరాయి. సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం రూ.51లక్షలను కేటాయించడంతో గ్రామంలోని రోడ్లన్నీ సీసీరోడ్డుగా మారాయి. గతంలో వర్షాలుపడితే ఎక్కడికక్కడ రోడ్లపై నీరు నిలిచి ఇబ్బంది పడేవారమని, సీసీరోడ్ల నిర్మాణంతో సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు .

రూ.40లక్షలతో సచివాలయం ఏర్పాటు..

పాలనను గ్రామస్థాయిలో ప్రజల ముంగిటకే తీసుకురావలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందులోభాగంగా గ్రామ సచివాలయ నిర్మాణాలు చేపట్టింది. పెద్దాపురంలో గ్రామ సచివాలయం నిర్మాణం కోసం రూ.40లక్షలను కేటాయించి, పనులు పూర్తిచేశారు. మరో రూ.17.50లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణం కూడా చేపట్టారు. వ్యవసాయాభివృద్ధి కోసం రైతులకు అండగా ఉండేందుకు రూ.21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)ను నిర్మించారు. ఇలా రూ.1.31కోట్ల రూపాయలతో పెద్దాపురం పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కంచికచర్ల-పెద్దాపురం రహదారిని రూ.18కోట్లతో అభివృద్ధి చేశారు. ఇలా మునుపెన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న పాలనలో సాధ్యమైందని గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఆయా అభివృద్ధి పనులతోపాటు ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందుకు కృషి చేస్తున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకు అండగా ఉంటామని గ్రామస్తులు చెబుతున్నారు.

మునుపెన్నడూ చూడని అభివృద్ధి



గతంలో పాలకుల, అధికారుల చుట్టూ తిరిగినా పనులు జరిగేవి కావు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నేడు గ్రామాలు గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని చూస్తున్నాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, పాఠశాలలు, రహదారుల అభివృద్ధి పనులతో మౌలికవసతుల విషయంలో గ్రామాలు, పట్టణాలతో పోటీపడుతున్నాయి.

– కోటేరు లక్ష్మి, వీరులపాడు ఎంపీపీ

పొలిమేర దాటకుండానే పనులు



గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రమైన వీరులపాడు వెళ్లాల్సి వచ్చేది. కానీ గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థతో రావడంతో మండల కేంద్రానికి వెళ్లే పని తప్పింది. ఏ పని కావాలన్నా గ్రామంలోనే అవుతుంది. పొలిమేర దాటాల్సిన అవసరం లేకుండా అర్హత ఉంటే అన్ని పథకాలు, సర్టిఫికెట్లను సైతం వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి అందిస్తున్నారు. ప్రజారంజక పాలనను అందిస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉంటాం.

– మల్లెల రాంబాబు, పెద్దాపురం

విద్యార్థులకు అభినందన



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటకు చెందిన త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఆన్‌లైన్ నృత్య తరగతుల్లో ప్రతిభ కనబరిచారు. కర్నాటకు చెందిన ఇంటర్నేషనల్ క్లాసికల్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ(ఐసీఎండీఏ) వారు ఈనెల 15న నిర్వహించిన కూచిపూడి నాట్య విభాగంలో జగ్గయ్యపేటకు చెందిన త్రినేత్ర ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు పాల్గొని 'అయిగిరి నందిని' అనే అంశాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 10మంది విద్యార్థులు తమ ప్రతిభను కనపరచి ప్రపంచ రికార్డును సాధించగా, వీరిలో జగ్గయ్యపేటకు చెందిన అశ్రిత, భవ్యశ్రీ, కుందన ప్రియ, దాక్షిణ్య, పర్ణిక, చరణి ఉన్నట్లు త్రినేత్ర డ్యాన్స్ అకాడమి నిర్వాహకులు భారతీదేవి తెలిపారు. నృత్యతరగతుల్లో ప్రతిభచూపిన విద్యార్థులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అకాడమీ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, త్రినేత్ర డ్యాన్స్ అకాడమి నిర్వాహకులు భారతీదేవి పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

నందిగామ: ఓ ఫైనాన్స్ కంపెనీని మోసం చేసిన వ్యక్తిపై నందిగామ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన సూరంపల్లి అప్పారావు 2014లో ఓ ఫైనాన్స్ కంపెనీ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ కంపెనీకి బకాయిలు చెల్లించకుండానే ట్రాక్టర్‌ను విక్రయించేశాడు. దీంతో సదరు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు చీటింగ్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలనలో ఎస్టీలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): రాష్ట్రంలోనే ఎస్టీ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచితస్థానం కల్పించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలోని జెండాచెట్టు సెంటర్ వద్ద ఆదివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు కూడా చేయని విధంగా రాష్ట్రంలో ఎస్టీ సామాజిక వర్గాన్ని అన్ని రంగాలలో ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. ఉపముఖ్యమంత్రి పదవులతోపాటు మంత్రి పదవులు, కార్పొరేషన్ పదవుల్లోనూ ఎస్టీలను నియమించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించటమే కాకుండా కులమతాలు, రాజకీయాలు చూడకుండా వారి ఇంటి ముంగిటనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజన తండాలను అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. టీడీపీవారు ఎస్టీలను ఓటు బ్యాంకుగానే చూశారు తప్ప సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేయలేదన్నారు. ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్‌ను కూడా దారి మళ్లించారని విమర్శించారు

తండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు పూర్తిగా విస్మరించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారని కొనియాడారు. నాలుగున్నరేళ్లుగా జరుగుతున్న అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మంచి జరిగింది అని భావిస్తేనే మరోసారి తమకు ఓట్లేసి ఆశీర్వదించాలని కోరారు. ఇటీవల మండల, గ్రామ ఎస్టీ సెల్ కన్వీనర్‌లుగా నియమితులైన భూక్యా రాందాస నాయక్, జ్వాలా నాయక్‌లను అభినందించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేయాలని సూచించారు. అదే విధంగా గ్రామానికి వచ్చిన మహారాష్ట్రలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఇస్లావత్ ప్రతాప్‌కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, మండల సచివాలయ కన్వీనర్ షాఉద్దీన్, యూత్ కన్వీనర్ సాయి, సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరాములు నాయక్, పాండు రంగారావు, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీసభ్యుడు రవీంద్ర, సక్కు, బాల్యానాయక్, బద్యా నాయక్, పాండు, కాసరగడ్డ సీత పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ: చంద్ర గ్రహణం పూర్తయిన తర్వాత ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం అర్చకులు మండలంలోని ఆయా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మండలాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. నందిగామ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లోనూ సంప్రోక్షణ అనంతరం స్వామివార్లకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

పేటలో మహిళా ఓటర్లే అధికం

జగ్గయ్యపేట: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 1,97,017మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 94,936మంది, మహిళా ఓటర్లు 1,02,021మంది, ఇతరులు 11మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు మరో 49మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 7085 మంది అధికంగా ఉన్నారు. జగ్గయ్యపేట మండలంలో 52,056మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 25,240 మంది, మహిళలు 26,811మంది ఉన్నారు. ఇతరులు ఐదుగురు ఉన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో 41,774మంది ఓటర్లకుగాను పురుషులు 19,706మంది, మహిళలు 22,064మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. వత్సవాయి మండలంలో 47,975మంది ఓటర్లకుగాను పురుషులు 23,187మంది, మహిళా ఓటర్లు 24,788మంది ఉన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో 40,067మంది ఓటర్లకుగాను పురుషులు 19,462, మహిళలు 20,603 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాలకు సంబంధించి 15,096మందికి గాను పురుషులు 7,341 మంది, మహిళలు 7,750మంది ఉన్నారు. అదేవిధంగా సర్వీస్ ఓటర్లు 49 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. 2019లో మొత్తం 1,95,735మంది ఓటర్లుండగా 2023 నాటికి అదనంగా 1282మంది ఓటర్లు చేరడంతో మొత్తం ఓటర్ల సంఖ్య 1,97,017 మందికి చేరింది.

ఓటర్ల మార్పులు, చేర్పులకు అవకాశం..

పెనుగంచిప్రోలు: కొత్త ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు తహశీల్దార్ కె.లక్ష్మీకల్యాణి ఆదివారం తెలిపారు. మండలంలో 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని వివరించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం బీఎల్‌వోలను సంప్రదించాలని తహశీల్దార్ సూచించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ ఉదయభాను



విజేతలతో విప్ సామినేని ఉదయభాను, రంగాపురం రాఘవేంద్ర, గాంధీ, పద్మకుమారి, నాగమణి

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో క్రీడలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 17నుంచి జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ స్థాయిలో పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామినేని విశ్వనాథం, పద్మావతమ్మ మెమోరియల్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈపోటీల్లో ప్రథమ బహుమతిని పెనుగంచిప్రోలు పీసీసీ గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని జగ్గయ్యపేట జట్టు, తృతీయ బహుమతిని భీమవరం జట్టు, నాలుగో బహుమతిని పెనుగంచిప్రోలు జట్టు గెలుచుకున్నాయి. విజేతలకు సామినేని ఉదయభాను నగదు బహుమతితోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడల నిర్వహణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.58 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు, యువతను ప్రోత్సహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఆటలను పండుగలా జరుపుకోవాలని, పురుషులతోపాటు మహిళలు కూడా క్రీడల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు విద్య, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్నందున యువత క్రీడల్లో రాణించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలని పిలుపునిచ్చారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మైనింగ్ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల రామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నర్సయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఎస్ఐ దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నిక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సంఘ నాయకులు

కంచికచర్ల : కంచికచర్ల, వీరులపాడు మండలాల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కార్యవర్గ సమావేశం స్థానిక ఎన్‌జీఓస్ హోంలో ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషిచేస్తోందన్నారు. సంఘంలోని సభ్యులందరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. అనంతరం రెండు మండలాలకు సంఘ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. కంచికచర్ల మండల గౌరవ అధ్యక్షుడిగా జీఎస్ గంగాధర్, అధ్యక్షుడిగా మేరుగు రామారావు, ప్రధాన కార్యదర్శిగా ఏపూరు నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరులపాడు మండల గౌరవాధ్యక్షుడిగా జే రామకృష్ణ, అధ్యక్షుడుగా ఎస్‌వీఎస్ఎస్ నాగేశ్వరగుప్తా, ప్రధాన కార్యదర్శిగా కామా ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వరరావు, జి. హరి ప్రసాద్, రెడ్‌స్టార్, పులి శ్రీనివాసరావు, వెంకట్, రామారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్

కంచికచర్ల : బెల్టుషాపులు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక జుజ్జూరు రోడ్డు, మోడల్‌కాలనీ, గొట్టుముక్కల రోడ్డు, ఇందిరాకాలనీలలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గొట్టుముక్కల రోడ్డులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్ఐ మాట్లాడుతూ మద్యం దుకాణాల వద్ద, బహిరంగ ప్రదేశాలలో కూడా మద్యం తాగరాదన్నారు. మద్యం అక్రమంగా అమ్మినా , ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు మృతి

కంచికచర్ల : ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గడ్డిమందు తాగి, వైద్యశాలలో చికిత్సపొందుతున్న వృద్ధుడు మృతిచెందిన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన కన్నెకంటి భాస్కరరావు(62) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన రెండురోజుల కిందట ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆయన్ను వెంటనే వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

మిట్టగూడెం(విస్సన్నపేట): క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండలంలోని తాతకుంట్ల పంచాయతీ మిట్టగూడెంలో గొంతెమ్మ (బతుకమ్మ) పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. వాలీబాల్ పోటీలను ఎంపీపీ వీక్షించి జట్ల సభ్యులను పరిచయం చేసుకున్నారు.